క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామికి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

అల్పాహారం అందజేత



బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రేబాల గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలో గురువారం అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్రీమ్ సంస్థ అధ్యక్షుడు ఇశ్రాయేల్ మాట్లాడుతూ గుర్రం డేవిడ్ 25వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అల్పాహారాన్ని అందజేశామన్నారు.

వృద్ధుడి అదృశ్యం



నరాల రమణారెడ్డి (ఫైల్)

పొదలకూరు : మండలంలోని డేగపూడి గ్రామానికి చెందిన నరాల రమణారెడ్డి(65) అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఇంట్లో స్వల్ప వివాదం వల్ల గతనెల రోజులుగా కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించిన కుటుంబసభ్యులు చివరకు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్సై ఎస్‌కే కరిముల్లా దర్యాప్తు చేస్తున్నారు.

12న జిల్లాస్థాయి చెస్ పోటీలు

బుచ్చిరెడ్డిపాళెం : ఈనెల 12న జిల్లా స్థాయి సీనియర్ ఓపెన్, సీనియర్ మహిళా చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పి.మస్తాన్‌బాబు గురువారం తెలిపారు. కోవూరులోని శ్రీచైతన్య స్కూల్‌లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 98481 47889 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో న్యాక్ టీమ్ పరిశీలన



కళాశాలను పరిశీలిస్తున్న న్యాక్‌టీం సభ్యులు

నెల్లూరు (అర్బన్) : నగరంలోని దొడ్ల కౌశల్యమ్మ ప్రభుత్వ కళాశాలలో న్యాక్ అసిస్‌మెంట్ మొదటి రోజు గురువారం జరిగింది. పరిశీలనకు చైర్‌పర్సన్ డాక్టర్ సునీతా మిశ్రా, మెంబర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ అన్నా మేరీ ఫెర్నాండజ్, గౌరవ మెంబర్ సాజీముల్ అగస్టీన్ వచ్చారు. వీరు కళాశాలలోని వివిధ డిపార్ట్‌మెంట్‌లు, ఎన్‌ఎస్‌ఎస్, వైఆర్‌సీ, ఎన్‌సీసీ వింగ్స్‌ను పరిశీలించారు. ఈ ప్రక్రియ శుక్రవారం కూడా జరగనుంది.

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు(బృందావనం) : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్, ట్రెజరీ అధికారులకు గురువారం వినతిపత్రాలను అందజేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం.గౌస్, ఎస్వీఎన్ మూర్తి తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్) : నగరంలోని వెంకటేశ్వరపురంలో పెన్నా వంతెన వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. శ్రీవెంకటేశ్వర పెయింటర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుచ వైఎస్సార్‌సీపీ నేతలు ముజీర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, విజయ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాయాజలం

- వీధికొక నీటి శుద్ధి పథకం
- వేసవిలో పెరగనున్న డిమాండ్
- పెద్ద ఎత్తున నీటి వ్యాపారం



పొదలకూరు పట్టణంలో వాటర్‌ప్లాంట్

పొదలకూరు : నీటితో వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు నిబంధనలు, ప్రమాణాలు పాటించకుండా శుద్ధి చేసిన నీరును అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా ప్రజలు వీటికి అలవాటు పడ్డారు. పట్టణంలో 25 వాటర్‌ప్లాంట్లు ఉండగా వీటిలో సగం ప్లాంట్లకు అనుమతులు లేవని తెలుస్తోంది. సాధారణంగా పంచాయతీ ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటిని అందివ్వాల్సి ఉంది. వేసవికాలంలో కూడా పట్టణ జనాభాకు సరిపడా రీతిలో పంచాయతీ నిర్వాహకులు తాగునీటిని అందిస్తున్నా క్యాన్ నీటికి అలవాటు పడిన ప్రజలు వాటినే తాగుతున్నారు. ఈ నేపథ్యంలో క్యాన్ నీటికి డిమాండ్ ఏర్పడింది. చాలామంది ఆటోల్లో క్యాన్లను ఏర్పాటు చేసుకుని ప్లాంట్ల వద్ద నీటిని పట్టుకుని ప్రజల వద్దకు వెళ్లి అమ్ముతున్నారు.

పుట్టగొడుగుల్లా..

మండల పరిధిలోని గ్రామాల్లో కూడా వాటర్ ప్లాంట్లను నిర్మిస్తున్నారు. ప్రతి ఏడాది నీటిశుద్ధి పథకాలు పెరుగుతున్నాయి. అయితే నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో పెంచలకోన విజయేశ్వరీదేవి ట్రస్ట్ సౌజన్యంతో వాటర్ ప్లాంట్లను నిర్మించారు. మరికొన్ని గ్రామాల్లో కొందరు యువకులు సొంతంగా నిర్మించి నిర్వహిస్తున్నారు. పట్టణంలో చాలా రోజులుగా ఉన్న వాటర్ ప్లాంట్ల నుంచి ఆటోలో 2 వేల లీటర్ల ట్యాంకును ఏర్పాటు చేసుకుని వీధుల్లో పర్యటిస్తూ అమ్ముతున్నారు. గ్రామాల్లో మాత్రం ప్లాంట్ల వద్దకే జనాలు వెళ్లి నీటిని పట్టుకుంటున్నారు. అయితే కొందరు వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలను పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నీటిని శుద్ధి చేయడంలో ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేసవిలో నీటి వ్యాపారం

వేసవిలో దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉన్న వాటర్ ప్లాంట్లకు డిమాండ్ పెరుగుతోంది. పట్టణం, పల్లెల్లోని 80 శాతం మంది బోరుబావి, పంచాయతీ సరఫరా చేసే నీటిని సేవించడం మానుకున్నారు. ఫలితంగా నీటిశుద్ధి పథకాలపై పూర్తిగా ఆధారపడడంతో వేసవిలో ప్లాంట్ల నిర్వాహకులు సరిపడా నీటిని అందించే పరిస్థితి ఉండదు. మంచిపేరున్న ప్లాంట్ల నిర్వాహకులకు బాగా డిమాండ్ పెరుగుతోంది. కొందరు నిర్వాహకులు డిమాండ్ పెరిగిన సమయంలో నీటిని శుద్ధి చేయడంలో ఎలాంటి ప్రమాణాలు పాటించరనే విమర్శలు ఉన్నాయి. వేసవిలో ఒక్కొక్క ప్లాంట్ నిర్వాహకులు 150 నుంచి 300 క్యాన్ల వరకు ప్రతినిత్యం అమ్ముకుంటున్నారు.



ట్యాంకును ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్న ఆటో

ప్రమాణాలు పాటించాలి



“ వాటర్ ప్లాంట్లు నిర్వహించే వారు ప్రమాణాలు పాటించాలి. నీరు కలుషితం అయితే ప్రజలు అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుంది. వాటర్ ప్లాంట్లపై పంచాయతీల అధికారుల పర్యవేక్షణ ఉంటే బాగుంటుంది.

– ఎస్‌కే జమీర్, పొదలకూరు

పంచాయతీ ప్లాంట్లను సిద్ధం చేస్తున్నాం



“ పట్టణంలో తాగు నీటి సమస్యలు లేవు. మొత్తం ఆరు వాటర్ ప్లాంట్లను సిద్ధం చేస్తున్నాం. ప్రైవేటు ప్లాంట్లపై ఫిర్యాదు అందితే పరిశీలన చేస్తాం. ప్రతి ప్రాంతానికి పంచాయతీ ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నాం.

– ఎస్‌కే అల్లాభక్షు, పంచాయతీ సెక్రటరీ, పొదలకూరు

పంచాయతీ ఆధ్వర్యంలో..

పట్టణంలో పంచాయతీ పర్యవేక్షణలో వాటర్ ప్లాంట్లను నిర్మిస్తున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో పంచాయతీ నిర్వాహణలో ఆరు వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇవి పూర్తయితే తక్కువ ధరకు నాణ్యమైన తాగునీటిని అందించే అవకాశం కలుగుతుంది. పంచాయతీల వాటర్ ప్లాంట్‌లు వినియోగంలోకి వస్తే పోటీ ఏర్పడి ప్రైవేటు ప్లాంట్లు కూడా తక్కువ ధరకు నీటిని అందించే అవకాశం ఉంది.

మర్యాదపూర్వకంగా..



మావులూరును సన్మానిస్తున్న నేతలు

ఇందుకూరుపేట : నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన మావులూరు శ్రీనివాసులురెడ్డిని పలువురు నాయకులు మర్యాదపూర్వంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, షేక్.షబ్బీర్, పామంజి శ్రీనివాసులు, కాటంగారి కృష్ణ, ఎస్.శ్రీనివాసులురెడ్డి, టి.రమణయ్య, జి.ప్రసాద్, ఖాజారంతుల్లా పాల్గొన్నారు.

నేడు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని ఆ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ జనార్దనరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణభారత్ ట్రస్ట్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా విజేతలకు అభినందన



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



వ్యక్తిగత చాంపియన్ ఇందుతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట : గంగపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన 98వ కోవూరు జోన్ గ్రిగ్ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటారు. దీంతో పోటీల విజేతలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్‌ను గురువారం పాఠశాల ఆవరణలో అభినందించారు. అలాగే వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచిన పి.ఇందును సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం చలపతి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గోపీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

- సెబ్ సీఐ బాలకృష్ణ



మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

ముత్తుకూరు : మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలతో అనర్థాలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ అన్నారు. ముత్తుకూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం జరిగిన మాదక ద్రవ్యాల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. చిన్నతనం నుంచి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వీటికి అలవాటు పడితే జీవితం అంధకారమవుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశలో కేవలం చదువులపై మాత్రమే దృష్టి కేంద్రీకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాదక ద్రవ్యాల జోలికి వెళ్లేదిలేదంటూ ప్రతిజ్ఞ చేయించారు. సెబ్ ఎస్సై మొగల్‌బాబు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మనుబోలు : మండలంలోని అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గురువారం ఉపాధ్యాయులు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వారు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే పరీక్షలు సక్రమంగా రాయగలరన్నారు. అల్పాహారం అందించేందుకు సహకరిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

రేబాల కాలనీలో చోరీలు

- రూ.లక్ష నగదు, వెండి పట్టీల అపహరణ



చెల్లాచెదురుగా పడి ఉన్న సామగ్రి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల కాలనీలో దుండగులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఘటన గురువారం వేకువజామున చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు రేబాల కాలనీలో ఉన్న ఇంట్లో కింద పోర్షన్‌లో పశ్చిమగోదావరికి చెందిన పైడి రామకృష్ణ నివాసం ఉంటున్నాడు. అతను స్థానికంగా చేపల సాగు చేస్తున్నాడు. ఇంటి మొదటి అంతస్తులో రేబాలకు చెందిన కలిశెట్టి శ్రీనివాసులు అనే వ్యక్తి కుటుంబం నివాసం ఉంటోంది. అయితే పైడి రామకృష్ణ తన కుటుంబంతో కలిసి మంగళవారం రాత్రి తన స్వగ్రామానికి వెళ్లాడు. కాగా శ్రీనివాసులు తన కుటుంబంతో కలిసి బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండడంతో బుధవారం మధ్యాహ్నం వెళ్లాడు. దీనిని గమనించిన దుండగులు గురువారం వేకువజామున ముందుగా కింద ఇంటి తలుపులను గడ్డపారతో తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తలుపులను పగులగొట్టి అందులోని దాదాపు రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. అనంతరం భవనం పైకి వెళ్లి ఆ ఇంటి తలుపులను కూడా గడ్డపారతో పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తలుపులను ధ్వంసం చేసి అందులోని రూ.4 వేల నగదు, వెండి పట్టీలు అపహరించి పరారయ్యారు. ఉదయం శ్రీనివాసులు కుటుంబం వచ్చి చూడగా తమ ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. అలాగే కింద ఇంటి తలుపులు కూడా పగులగొట్టి ఉండడంతో వెంటనే రామకృష్ణకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీంతో ఎస్సై వీరప్రతాప్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేశారు.

స్వచ్ఛత.. అందరి బాధ్యత



మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యత అని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పలు ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించి స్థానికంగా ఉన్న ప్రజలతో మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం పలు నగర పంచాయతీలతో పోటీ పడుతోందని తెలిపారు.

వాడవాడలా ముమ్మర ప్రచారం



వెంకటాచలం : నిడిగుంటపాళెంలో ప్రచారం చేపడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కొడవలూరు : నార్నురాజుపాలెంలో ప్రచారం చేస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్



తోటపల్లిగూడూరు : కోనెరపాళెంలో..



ఇందుకూరుపేట : కొత్తూరు గ్రామంలో..



మనుబోలు : కొలనకుదురులో..



పొదలకూరు : బ్యాలెట్ నమూన పత్రం అందజేత

- శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ఓటర్లకు అభ్యర్థన

వెంకటాచలం : తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య కోరారు. మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో గురువారం పేర్నాటికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

- పొదలకూరు : పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో గురువారం బిట్–8 ఎంపీటీసీ సభ్యురాలు గంగవరపు లక్ష్మీకల్యాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిని గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జి.వేణుగోపాల్‌రెడ్డి, హరి ఉన్నారు.
- ఇందుకూరుపేట : పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేత కైలాసం శ్రీనివాసులురెడ్డి కోరారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఆయన వెంట లేబూరు వెంకరెడ్డి, తువ్వర తిరుపతి ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

కొడవలూరు : పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. నార్నురాజుపాళెం ఎస్సీ కాలనీలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి పట్టభద్రులంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ నేతలు పెద్దిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఎండి.కరిముల్లా, గాలి సునీల్, బచ్చు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- మనుబోలు : పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నేతలు కసిరెడ్డి ధనంజయరెడ్డి, గుండాల ఆదినారాయణ కోరారు. మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతారని తెలిపారు. అలాగే మనుబోలు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కోదూరు విజయ్‌మోహన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గుంజి రమేష్, నవకోటి, కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఉప సర్పంచ్ పాములూరు లచ్చారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు ఆర్.వెంచురామిరెడ్డి, హరి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.
- పొదలకూరు పట్టణంలోని రామనగర్‌గేటు సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఖాదర్, సచివాలయ కన్వీనర్లు సురేఖ, మస్తాన్, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.
- తోటపల్లిగూడూరు : పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయం తథ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్‌తో కలిసి ఆయన గురువారం కోనెరపాళెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేర్నాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఎంపులూరు కృష్ణ పాల్గొన్నారు.
- బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని రేబాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రచారం చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు మస్తానయ్య, శ్రీధర్, శ్రీహరి, హరిప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.
- విడవలూరు మండలంలోని రామచంద్రాపురం పంచాయతీలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, నాయకులు బుచ్చంగారి తిరుపతి, ప్రసాద్ పాల్గొన్నారు.



పొదలకూరు : ఎమ్మార్వో కాలనీలో..



బుచ్చిరెడ్డిపాళెం: రేబాలలో..



విడవలూరులోని రామచంద్రాపురంలో..

ప్రేమ వ్యవహారమే హత్యాయత్నానికి కారణం?

- నిందితుల కోసం పోలీసుల గాలింపు

నెల్లూరు(క్రైమ్): ప్రేమ వ్యవహారంలో ప్రత్యర్థులకు సహకరిస్తున్నాడని నెపంతో ఫార్మసీ విద్యార్థిపై హత్యాయత్నం జరిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. వసీం అక్రమ్ అనే ఫార్మసీ విద్యార్థిపై బుధవారం జరిగిన హత్యాయత్నం ఘటనపై బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ కె.రాములునాయక్ విచారణ వేగవంతం చేశారు. యువకుడిపై నిందితులు దాడి చేసిన దృశ్యాలు కళాశాల సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. వాటి ఫుటేజీలను పోలీసులు గురువారం సేకరించి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల్లో కొందరు విద్యార్థులు కాగా మిగిలిన వారు బయటివారని సమాచారం.

సర్వేపల్లి కాలువలో వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్) : నగరంలోని హరనాథపురం జంక్షన్ గుర్రలమడుగు సంఘం సమీపంలోని సర్వేపల్లి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించి బాలాజీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కె.సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుని ఛాతీపై జ్యోతి అని పచ్చబొట్టు ఉంది. కుడిచేతి మణికట్టుపై హార్ట్(లవ్) గుర్తు ఉంది. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుని ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైమ్) : విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి ఫ్లాట్‌లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. గోమతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కె.కోటయ్య కుటుంబం నివాసం ఉంటోంది. గురువారం తెల్లవారుజామున ఏసీలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. దీనిని గమనించిన కోటయ్య, ఆయన కుటుంబసభ్యులు ఫ్లాట్ నుంచి బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో గృహోపకరణాలు దగ్ధం కావడంతో రూ.లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది.